## క్లుప్తంగా

### సబ్సిడీ వరి విత్తనాలు సిద్ధం

నాగాయలంక: మండలంలో రైతులకు సబ్సిడీపై పంపిణీ చేసేందుకు వరి విత్తనాలు అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద సిద్ధంగా ఉన్నాయని, ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఏ.సంజీవరావు ఆదివారం చెప్పారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో కేజీకి రూ.5 సబ్సిడిపై విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆ మేరకు రైతులకు ఎక్కడికక్కడ పంపిణీ చేస్తున్నామన్నారు. మండలంలో బీపీటీ 5204 రకం వరి విత్తనాలను రైతులు అధికంగా వినియోగ స్తున్నందున, వీటిని 300 క్వింటాళ్లు, ఎంటీయూ 1061 రకం విత్తనాలు 15 క్వింటాళ్లు సిద్ధంగా ఉంచామన్నారు. 5204 విత్తనాలు 25 కేజీల బస్తా ధర రూ.1,045 కాగా రూ.125 సబ్సిడీ పోను రూ.920, 1061 రకం విత్తనాలు 25 కేజీల బస్తా ధర రూ.1,194 కాగా రూ.150 సబ్సిడీ పోను రూ.1,044 చొప్పున రైతులు చెల్లించాల్సి ఉంటుంది. విత్తనాలు అవసరమైన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు నకళ్లతో రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకుల ద్వారా పేర్లను ఆన్‌లైన్ రిజిస్టర్‌లో నమోదు చేయించుకుని విత్తనాలు తీసుకోవాలని ఏవో సంజీవరావు చెప్పారు.

### ఉపాధ్యాయుడికి వీడ్కోలు

గూడూరు: గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన బోలెం సుభాష్ చంద్రబోస్‌కు ఆదివారం ఘనంగా సన్మానం చేశారు. బయలాజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా సుదీర్ఘ కాలం పనిచేసిన బోస్ ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనను తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

### ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహం



రామచంద్రపురం(అవనిగడ్డ): మండల పరిధిలోని రామచంద్రపురంలో పది, ఇంటర్‌లో మెరిట్ సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహాన్ని మచిలీపట్నంకు చెందిన డాక్టర్ కుప్పా రామస్వామి శాస్త్రి, సర్పంచి వాకా నాగ రమేష్ అందించారు. దివంగత మోదుమూడి శ్రీహరి 25వ వర్ధంతి ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రామస్వామి శాస్త్రి, సర్పంచి తదితరులు శ్రీహరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీహరి జ్ఞాపకార్థం నాలుగు సిమెంట్ బల్లలను దాతలు పంచాయతీకి అందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బచ్చు ఆంజనేయులు, శ్రీహరి కుటుంబ సభ్యులు యల్లాప్రగడ రవి కుమార్, మురళీకృష్ణ, దాలిపర్తి కృష్ణమూర్తి, నెలబాలుడు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో భగవద్గీత పారాయణం



మచిలీపట్నంటౌన్: నగరంలోని బుట్టాయిపేట దత్తాశ్రమంలో సుహాసినీలు ఆదివారం సంపూర్ణ సామూహిక భగవద్గీత పారాయణ చేశారు. ఉదయం ప్రారంభమైన కార్యక్రమం మధ్యాహ్నం వరకు కొనసాగింది. 300 మందికిపైగా సుహాసినీలు హాజరై పారాయణ చేశారు. శివరామకృష్ణ బృందం శ్రీ దత్తస్వామికి తైలాభిషేకం నిర్వహించారు. వచ్చిన భక్తులకు అన్నసమారాధన చేశారు. కార్యక్రమాలను ట్రస్టీలు టీవీ సుబ్బారావు, కేవీఎల్ఎన్ ప్రసాద్, టి.శుభారాణి, సీహెచ్ గోవిందరావు, ఎంఎం.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

### అనుమతులు ఉంటేనే విత్తనాలు విక్రయించాలి



పెడన: అనుమతుల కోసం దరఖాస్తు చేసి, అనుమతులు రాకముందే విత్తనాలను రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖాధికారులు విత్తనాల దుకాణాదారులను హెచ్చరించారు. మచిలీపట్నం ఏడీఈ మణిధర్, మచిలీపట్నం ఇన్‌చార్జి ఏడీఈ జీవీ శ్రీనివాసరావు, పెడన ఏవో, పెడనలోని కోరమాండల్ ఫెర్టిలైజర్స్ దుకాణం, చేవేంద్ర, నడుపూరులలోని విత్తనాల దుకాణాలలో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పలు విషయాలను గమనించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన విత్తనాలను కూడా విక్రయానికి ఉంచినట్లు గుర్తించి అనుమతులు పత్రాలను పరిశీలించారు. అయితే వీటిల్లో కొన్నిటికి మాత్రమే అనుమతులుండి, మరికొన్ని విత్తనాలకు అనుమతులు లేవు. ఇదే విషయమై ఆయా దుకాణాదారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అనుమతులు ఉన్న వాటిని మాత్రమే రైతులకు విక్రయించాలని, అనుమతులు లేని వాటిని విక్రయిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతుల కోసం దరఖాస్తు చేశామని ఆయా దుకాణాదారులు చెప్పగా అనుమతులు వచ్చిన తర్వాతే అమ్మకాలు చేసుకోవాల్సిందిగా అధికారులు సూచించారు.

# ఖరీఫ్ పనులకు ఊతమిచ్చిన వర్షం

- నారుమడులు సిద్ధం చేసుకుంటున్న రైతులు
- కాలువలకు నీరిస్తేనే భవిష్యత్తు బాగు

కృత్తివెన్ను: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పుడిమితల్లి మురిసిపోతోంది. ఇప్పటి వరకు మండే ఎండలకు తోడు వేడి గాలుల ప్రభావం ప్రజలతో పాటు రైతాంగాన్ని తీవ్ర కలవరానికి గురి చేసింది. ఇప్పుడు కురుస్తున్న వర్షాలతో ప్రజలు సేదతీరడమే కాకుండా ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. మండల వ్యాప్తంగా దాదాపు 5 వేల ఎకరాలలో రైతులు ఈ ఏడాది ఖరీఫ్‌ను సాగు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు వ్యవసాయశాఖాధికారి ఎస్.జెన్నీ వివరించారు.



యండపల్లి వద్ద ఖరీఫ్ నారుమడిని సిద్ధం చేసుకుంటున్న రైతు

#### సాగుపనుల్లో బిజీబిజీగా..

నిన్నటి వరకు వర్షాలు లేక పంటకాలువల ద్వారా సాగునీరు వస్తుందో రాదోన్న మీమాంసతో రైతాంగం ఆకాశంవైపు చూస్తూ గడిపారు. ఇప్పుడు కురుస్తున్న వర్షాలు రైతుల్లో సంతోషాన్ని నింపుతున్నాయి. దీంతో వారు నారుమడులు సిద్ధం చేసుకుంటుండగా మరికొందరు వెదసాగు వైపు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే మెట్టసాగులో విత్తనాలు చల్లిన రైతులు కలుపు నివారణ మందుల పిచికారీలో బిజీగా ఉన్నారు.

#### కాలువల ద్వారా నీరిస్తేనే సాగు..

ఏదో నాలుగు రోజులు కురిసే వర్షాలపైనే ఆధారపడితే సాగు చేయడం కష్టమేనని పంటకాలువల ద్వారా నీటిని విడుదల చేస్తేనే సాగు అనుకూలంగా సాగుతుందని రైతులంటున్నారు. ఇప్పటి వరకు పంటకాలువల ద్వారా సాగునీటి సరఫరా లేదని, ఇలా అయితే ఖరీఫ్ సాగు కష్టమేనని నీరిచ్చి ఆదుకోవాలని వారు కోరుతున్నారు. ఇటీవల కృత్తివెన్నులో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఇరిగేషన్ అధికారులు ప్రస్తుతం తాగునీటికే కష్టమవుతుందని, సాగుకు నీరివ్వాలంటే ప్రాజెక్టుల్లో నీరు పూర్తిస్థాయిలో చేరాలని వివరించిన సంగతి తెలిసిందే.

#### కలుషితంగా ప్రధాన పంటకాలువ....

బంటుమిల్లి–లక్ష్మీపురం ప్రధాన పంటకాలువలోకి సముద్రపు ఆటు, పోటుల ద్వారా ఉప్పునీరు చేరింది. దీనికి వర్షపు నీరు తోడై కాలువలో నీరు పూర్తిగా కలుషితమై దుర్గంధం వెదజల్లుతోంది. త్వరలో కాలువల ద్వారా తాగు, సాగునీటిని పూర్తిస్థాయిలో విడుదల చేయాలని మండల ప్రజలతో పాటు, రైతులు కోరుతున్నారు.

#### విస్తారంగా వర్షం.. నారుమళ్లకు జీవం

పెడన: విస్తారమైన వర్షాలతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత ఐదు రోజుల కిందటి వరకు మబ్బులు వస్తున్నా, వర్షాలు పడక వెద సాగులో వేసిన విత్తనాలు మొలకెత్తుతాయో లేదోననే భయం వెంటాడింది. మొలకలు వచ్చిన నారుమళ్లు సైతం ఎండిపోతాయనే ఆందోళన రైతులు వ్యక్తం చేశారు. అటువంటి పరిస్థితుల నుంచి నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంట చేలల్లో, పక్కన పంట బోదెల్లోనూ వర్షం నీరు నిలిచి విత్తనాలు మొలకెత్తేలా, మొలకలు వచ్చిన నారుమళ్లకు ఊపిరి పోసినట్లయింది. ఎటు చూసినా వర్షం నీటితో పంట పొలాలుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే అధిక వర్షాలు పడితే ముంపు బారిన పడతాయనే ఆందోళన కూడా రైతులను వెంటాడుతోంది.



గురువిందగుంట ప్రాంతంలో నారుమళ్లలో నిలిచిన వర్షపు నీరు

## పూజిత, నేహలతశ్రీలకు కలెక్టర్ అభినందన

మచిలీపట్నం టౌన్: చేతిరాత శిక్షణలో ప్రతిభ కనబర్చిన నగరానికి చెందిన పసుపులేటి పూజిత, నేహలతశ్రీలను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అభినందించారు. గత వేసవిలో స్థానిక జవ్వారుపేట శ్రీ వెంకటేశ్వర పబ్లిక్ స్కూల్లో విజయవాడకు చెందిన అమ్మఒడి హ్యాండ్ రైటింగ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత చేతి రాత శిక్షణలో ప్రతిభ కనబర్చిన వీరు ఇరువురికీ కలెక్టర్ బాలాజీ ఆదివారం స్థానిక జెడ్పీ మీటింగ్ హాలులో జరిగిన ఓ కార్యక్రమంలో ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ పాఠశాలలో 835 మంది విద్యార్థులు శిక్షణలో పాల్గొనగా పూజిత, నేహలతశ్రీలు ప్రత్యేక ప్రతిభ చూపినందుకు కలెక్టర్ ప్రశంసించారు. వీరిద్దరిని ప్రోత్సహించిన తల్లిదండ్రులు శివకుమార్, అంజలి దంపతులను కూడా కలెక్టర్ అభినందించారు. అక్కాచెల్లెళ్లు అయిన వీరిద్దరూ నగరంలోని దేశాయిపేట మునిసిపల్ హైస్కూల్, ఎలిమెంటరీ స్కూలులో 9, 6 తరగతులు చదువుతున్నారు.



పూజిత, నేహలతశ్రీలకు ధ్రువీకరణ పత్రాలను ఇస్తున్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ

## మొక్కలను సంరక్షించండి

పెడన: మొక్కలను నాటడానికి ఎంత ప్రాధాన్యత ఇస్తామో, వాటిని సంరక్షించడానికి అంతే ప్రాధాన్యం ఇవ్వాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. ఆదివారం మండలంలోని దావోజిపాలెం గ్రామంలో అమలేశ్వరి యువశక్తి, గ్రామ యూత్ ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొక్కలు నాటే సమయంలో ప్రతి ఒక్కరూ మొక్కలను పెరటిలో పెంచడం వల్ల ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కార్యదర్శి శీరం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు కిట్ల పంపిణీ..**

నందిగామ జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు స్కూలు కిట్లను పంపిణీ చేశారు. విద్యార్థులు స్కూలు కిట్లను సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆర్జా వెంకట నగేష్, శలపాటి ప్రసాద్, శీరంప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మొక్కలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

## నూరు శాతం రుణ వసూళ్లు

నాగాయలంక: కేడీసీసీ బ్యాంకు నాగాయలంక బ్రాంచి పరిధిలోని ఎదురుమొండి పీఏసీఎస్‌లో 2023–24 సంవత్సరానికి నూరు శాతం రుణాల వసూలు సాధించినట్లు సంఘం సీఈవో కె.ఆనందబాబు ఆదివారం తెలిపారు. సొసైటీలో 422 మంది రైతుల నుంచి స్వల్పకాలిక రుణాలు రూ.188.73 లక్షలు, దీర్ఘకాలిక రుణాలు రూ.58.12 లక్షలు, ఇతర అప్పులు రూ.5 లక్షలు, మొత్తంగా రూ.251.85 లక్షలు నూరుశాతం వసూలు జూన్ 29 నాటికి పూర్తి చేశారు. గత 5 సంవత్సరాల నుంచి క్రమం తప్పకుండా ప్రతి ఏటా నూరు శాతం రుణాల వసూళ్లు చేస్తున్నట్టు సీఈఓ పేర్కొన్నారు. ఈ మేరకు పత్రాలను సిబ్బందితో కలసి ఆయన కేడీసీసీ చీఫ్ మేనేజర్ చింతలపూడి మధుబాబుకు అందజేశారు. నూరు రుణ వసూళ్లు సాధించిన సిబ్బందిని కేడీసీసీ నాగాయలంక బ్రాంచిలో జరిగిన ఒక కార్యక్రమంలో మేనేజర్ అభినందించారు. నోడల్ అధికారి జీఎస్ ప్రకాశరావు, సూపర్‌వైజర్ రెహమున్నీసా, సైకం హనుమంతరావు, నాయుడు శ్రీధర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



మేనేజర్‌కు ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న సీఈఓ, సిబ్బంది

## అంబేడ్కర్ భవనం పునర్నిర్మాణానికి చర్యలు

మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి

మచిలీపట్నంటౌన్: నగరం నడిబొడ్డున ఉన్న శిథిలమైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనాన్ని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆదివారం స్థానిక దళిత సంఘ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు మాట్లాడుతూ 2004లో టీడీపీ ప్రభుత్వం హయాంలో 20 ఏళ్ల క్రితం ఈ భవనాన్ని ప్రారంభించామని, 2019లో ఈ భవనాన్ని తిరిగి నిర్మించేందుకు తమ ప్రభుత్వం రూ.5 కోట్ల పైన వ్యయంతో ప్రతిపాదిస్తూ జీవో జారీ చేశామన్నారు. తరువాత ప్రభుత్వం భవన నిర్మాణంపై శ్రద్ధ చూపలేదన్నారు. భవనం పూర్తిగా శిథిలమైందని అన్నారు. ఈ భవనాన్ని మళ్లీ అధునాతన హంగులతో మల్టీపర్పస్ భవన నిర్మాణానికి అవసరమైన అంచనాలను రూపొందించాలని సాంఘిక సంక్షేమశాఖ ఉపసంచాలకులు షేక్ షాహెద్‌బాబును ఆయన ఆదేశించారు. ఈ భవనంలో సమావేశాలు, ఫంక్షన్లు నిర్వహించుకునేలా, గ్రంథాలయం, స్టడీ సర్కిల్, అండర్ గ్రౌండ్ పార్కింగ్ ఉండే విధంగా నిర్మిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు సీఎస్ఆర్ నిధులను సమీకరించి మహనీయునికి గుర్తుగా పెద్ద ఎత్తున అంబేడ్కర్ భవనాన్ని సుందరంగా నిర్మిస్తామన్నారు. ఈ పర్యటనలో మంత్రి వెంట మునిసిపల్ మాజీ చైర్మన్ ఎంవీవీ బాబాప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యం, కార్పొరేటర్ దేవరపల్లి అనిత, ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ క్యాస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ కృష్ణా జిల్లా అధ్యక్షుడు కర్రా సునీల్‌కుమార్, దళిత సంఘాల నాయకులు బందెల డానియల్ నోబుల్, చిట్టూరి యువరాజు, కొండ్రు భాస్కరరావు, చిన్నం సురేష్, కుమారి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, జనసేన నాయకులు మాదివాడ రాము, వంపుగడవల చౌదరి, గడ్డం రాజు, తెలుగుదేశం పార్టీ నాయకుడు పీవీ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



శిథిలమైన అంబేడ్కర్ భవన్‌ను పరిశీలిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

## నేడు ఇంటింటికీ పింఛన్ల పంపిణీ

మచిలీపట్నంటౌన్: నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లలో ఎన్టీఆర్ సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నుంచి ప్రారంభించేందుకు సచివాలయ సిబ్బంది సన్నద్ధమయ్యారు. నగరంలోని 50 డివిజన్ల సచివాలయాల్లో పనిచేస్తున్న వివిధ విభాగాలకు చెందిన ఒక్కొక్క సెక్రటరీకి 50 గృహాలను అధికారులు కేటాయించారు. అధికారులు నిర్ణయించిన రూట్‌మ్యాప్‌ల ప్రకారం వీరంతా వారి పరిధిలోని 50 గృహాలకు చెందిన లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లను అందజేయనున్నారు. ప్రభుత్వం ఆదేశించిన విధంగా సోమవారం ఉదయం 5గంటల నుంచి పంపిణీ కార్యక్రమం ప్రారంభించనున్నారు. నగరంలో మొత్తం 18,962 మంది పింఛను లబ్ధిదారులు ఉండగా వీరికి రూ.12.98 కోట్లను అందజేయనున్నారు. అన్ని సచివాలయాలకు చెందిన సెక్రటరీలు శనివారమే బ్యాంకుల నుంచి ఈ సొమ్మును తెచ్చి భద్రపరుచుకున్నారు. పింఛన్ల పంపిణీని కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు పర్యవేక్షించనున్నారు.

బంటుమిల్లి: మండల పరిధిలోని 21 గ్రామ పంచాయతీలలో కొత్తగా మంజూరు అయినా పింఛన్లు పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఎంపీడీవో జీఎస్ రామకృష్ణంరాజు ఆదివారం తెలిపారు. మండలంలో 6,907 పింఛన్లకు గాను మంజూరైన రూ.46,004000 సిద్ధం చేసినట్టు ఆయన తెలిపారు. వితంతు పింఛన్లు 1,561, వృద్ధాప్య పింఛన్లు 3,099, దివ్యాంగుల పింఛన్లు 1,015, గీత, మత్స్యకార సొసైటీ పింఛన్లు 678, ఒంటరి మహిళ పింఛన్లు 208, అభయ హస్తం పింఛన్లు 268, చేనేత తదితర పింఛన్లు 88 ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. వీరందరికీ సచివాలయం ఉద్యోగుల ద్వారా సోమవారం నుంచి ఇంటింటికీ పింఛన్లు అందజేసేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. సచివాలయ ఉద్యోగులు ఇంటి వద్దకు వచ్చినప్పుడు పింఛన్‌దారులు అందుబాటులో ఉండి పింఛన్ సొమ్ములు తీసుకోవాలని ఎంపీడీవో రామకృష్ణంరాజు విజ్ఞప్తి చేశారు.

## జడ్జి గంధం సునీతకు ఎమ్మెల్యే పరామర్శ

పెదకళ్లేపల్లి(మోపిదేవి): ఇటీవల పితృవియోగం చెందిన తూర్పు గోదావరి జిల్లా జడ్జి గంధం సునీతను అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్, మండలి రాజా, ఆదివారం పరామర్శించారు. పెదకళ్లేపల్లిలో జడ్జి సునీత ఇంటివద్ద ఆమె తండ్రి గంధం వీరరాఘవయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వీరరాఘవయ్య మృతి పట్ల తమ ప్రగాఢ సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. మండల ఉపాధ్యక్షుడు కడవకొల్లు సీతారామాంజనేయులు, అరజా కిరణ్‌కాంత్, తదితరులు పాల్గొన్నారు.



పెదకళ్లేపల్లిలో జడ్జి సునీతను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

## పేదల వైద్యం, ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పేదల వైద్యం, ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని పెదకళ్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24/7 ఆస్పత్రిగా ప్రజలకు సేవలందిస్తున్న వైద్య సిబ్బంది పని తీరు గురించి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కాలంలో ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య బాగా పెరిగిందని గ్రామ సర్పంచి అరజా సంధ్యారాణి భర్త అరజా కిరణ్‌కాంత్ ఎమ్మెల్యేకు వివరించారు. ముగ్గురు స్టాఫ్ నర్సులకు జనరల్ ఆఫ్, సెలవు సమయంలో ఇబ్బంది వస్తుందని, మరొక స్టాఫ్ నర్సు, వాచ్‌మెన్‌ను కూడా నియమించాల్సి ఉందని ఎమ్మెల్యేను కోరారు. మండలి రాజా, మండల ఉపాధ్యక్షుడు కడవకొల్లు సీతారామాంజనేయులు, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు గొర్రెపాటి దుర్గానాగేశ్వరావు, కేతరాజు శ్రీనివాసరావు, కూరేటి జగన్, బాదర్ల లోలాక్షుడు, గోళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పెదకళ్లేపల్లి పీహెచ్‌సీని సందర్శించిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

## రోడ్డుపై చెట్లను తొలగించిన వైఎస్సార్ సీపీ నేతలు



గోగినేనిపాలెం(ఘంటసాల): ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి ప్రధాన రహదారిపై కూలిన చెట్లను వైఎస్సార్ సీపీ నేతలు తొలగించారు. శనివారం రాత్రి ఘంటసాల మండలం గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్ వద్ద ప్రధాన రహదారికి అడ్డంగా భారీ చెట్టు కూలిపోయింది. దీంతో గ్రామస్తులు, ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో గ్రామ సర్పంచి కుంపటి సుశీల సూచనల మేరకు ఉప సర్పంచ్ గణపనేని వెంకటేశ్వరరావు, సొసైటీ ప్రెసిడెంట్ కుంపటి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నేత కుంపటి సుబ్బారావు తదితరులు ప్రధాన రహదారికి అడ్డుగా పడిపోయిన చెట్టును తొలగించారు. సకాలంలో స్పందించి చెట్టును తొలగించేందుకు చర్యలు తీసుకున్న సర్పంచి సుశీల, ఉప సర్పంచ్ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేతలకు గ్రామస్తులు, ప్రయాణికులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం

పెడన: పెడన, మచిలీపట్నం నియోజక వర్గాల వ్యాప్తంగా ఉన్న వందకుపైగా విద్యాసంస్థలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు సహాయ ఫౌండేషన్ ఆదివారం ప్రతిభ పురస్కారాలను అందజేసింది. స్థానిక గూడూరు రోడ్డులోని దేవాంగ కల్యాణ మండపంలో జరిగిన పురస్కారాల అందజేత కార్యక్రమంలో మచిలీపట్నం కార్పొరేషన్‌తో పాటు బందరు మండలం, పెడన టౌన్, పెడన మండలం, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు చెందిన 120 మందికిపైగా ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందజేసినట్లు ఫౌండేషన్ చైర్మన్ ఉస్మాన్ బాషా తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులలో ఎవరైనా నిరుపేదలు ఉంటే కేవలం డబ్బులు లేని కారణంగా ఉన్నత చదువులు కొనసాగించలేనివారికి దాతల సహాయంతో వారికి ఆర్థిక సహాయం చేస్తామన్నారు. ఈ ఏడాది కూడా సహాయ ఫౌండేషన్ దాతల నుంచి సహాయం తీసుకుని నిరుపేద విద్యార్థుల చదువులకు సాయం అందించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ సేవ కార్యక్రమాల్లో పొందే ఆనందం సంతృప్తి ఇస్తుందన్నారు. ఫౌండేషన్ వైస్ చైర్మన్ మామిడి ప్రసాదరావు, విద్యా విభాగం చైర్మన్ మట్టా రాధాకృష్ణమూర్తి, కళాశాలా అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఫౌండేషన్ సభ్యులు, వివిధ విభాగాల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ప్రతిభాపురస్కారాలు అందుకున్న విద్యార్థులతో ఫౌండేషన్ సభ్యులు

## ఉద్యోగ విరమణ పొందిన వారికి వీడ్కోలు



సుమతికుమారి దంపతులను సత్కరిస్తున్న ఎంఈవో వెంకటేశ్వరరావు



ఉద్యోగ విరమణ చేసిన ఏఈ సాయిప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లి మండల పరిధిలోని నిమ్మగడ్డ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కైలా సుమతికుమారి పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా జరిగింది. పాఠశాల ప్రాంగణంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో చెరుకూరి రాఘవులు–హెచ్‌ఎం సుమతికుమారి దంపతులకు ఎంఈవో– 2 పరిశె వెంకటేశ్వరరావు దుశ్శాలువ కప్పి పూలమాలవేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో పరిశె మాట్లాడుతూ గత 41 సంవత్సరాలుగా పలు ప్రాంతాల్లో పనిచేసిన సుమతికుమారి ఎందరో విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదిగేందుకు దోహదపడ్డారని కొనియాడారు. ఎక్కడ పనిచేసినా విద్యాబోధనలో ప్రత్యేక శ్రద్ధ, పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందించారని కొనియాడారు. అనంతరం గ్రామస్తులు సుమతికుమారి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పురిటిగడ్డ జెడ్పీహైస్కూల్ హెచ్‌ఎం కేబీఎస్‌శర్మ, ఎస్ఎంసీ చైర్మన్ పి.ప్రశాంతి, పాస్టర్ ఎస్.సంగీతరావు, ఉపాధ్యాయుడు బి.చినకేశవరావుతో పాటు గ్రామ పెద్దలు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: నగరపాలక సంస్థలో విద్యుత్ ఏఈగా సేవలు అందించిన కేవీ సాయిప్రసాద్ సేవలు మరువరానివని పలువురు వక్తలు పేర్కొన్నారు. సాయిప్రసాద్ ఆదివారంతో ఉద్యోగ విరమణ చేశారు. నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇంజినీర్లు, సిబ్బంది సాయిప్రసాద్, బాలలక్ష్మి దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 36 సంవత్సరాలుగా ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్న సాయిప్రసాద్ వివిధ హోదాల్లో అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఇంజినీర్ పి.శ్రీకాంత్, డీఈఈలు వరప్రసాద్, సతీష్‌చంద్ర, సాంబశివరావు, ఏఈ కె.వెంకటేశ్వరరావు, రెవెన్యూ అధికారి ఎస్.వెంకటేష్, ఇంజినీరింగ్ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

## అర్చకుల పేరున భూమిశిస్తు రశీదులు ఇవ్వాలి

అవనిగడ్డ: అర్చకుల ఆధీనంలో ఉన్న ఆలయ భూములకు అర్చకుల పేరున భూమిశిస్తు రశీదులు ఇవ్వాలని రాష్ట్ర అర్చక సమాఖ్య ప్రతినిధులు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. ఆదివారం ఎమ్మెల్యేను ఆయన గృహంలో కలుసుకున్న రాష్ట్ర అర్చక సమాఖ్య ప్రతినిధులు దీవి రామకృష్ణమాచార్యులు, వాసుదేవ సీతారామకృష్ణ తదితరులు ఆలయ భూమిశిస్తు సమస్యను వివరించారు. అనుభదారులైన అర్చకుల పేరున భూమిశిస్తు రశీదు ఇవ్వరాదని గత ప్రభుత్వం పేర్కొన్న నేపథ్యంలో ఆలయ భూములపై అర్చకులకు ఉన్న హక్కులను కోల్పోయే ప్రమాదముందని చెప్పారు. ఈ విషయాన్ని రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లి అర్చకుల పేరున భూమిశిస్తు రశీదులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అర్చక సమాఖ్య ప్రతినిధులు కుమార అచార్యులు, లక్ష్మీదాశరథి, బృందావనం అనంతరామాచార్యులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెదప్రోలు(మోపిదేవి): మండల పరిధిలోని పెదప్రోలు శివారు ప్రశాంతనగర్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో రేపల్లెకు చెందిన మద్దుల సాయికుమార్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు ఇచ్చిన వివరాలు ప్రకారం.. చల్లపల్లి నుంచి రేపల్లె వైపు ద్విచక్రవాహనంపై వెళ్తూ ఎదురుగా వస్తున్న కారును బలంగా ఢీ కొట్టడంతో తలకు తీవ్రగాయం అయ్యిందని తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని రేపల్లె ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

## మిల్క్ సొసైటీ అధ్యక్షుడిగా సురేష్ రెండోసారి ఎన్నిక



ఘంటసాల: పాడి రైతుల అభివృద్ధి, సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని ఘంటసాల పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు గొర్రెపాటి సురేష్ అన్నారు. ఘంటసాలలోని ఘంటసాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం అధ్యక్ష ఎన్నికలో గొర్రెపాటి సురేష్ రెండోసారి ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ రెండోసారి సంఘం అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన పాల ఉత్పత్తిదారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. సంఘం అభివృద్ధితో పాటు పాల ఉత్పత్తిదారులకు మరిన్ని సేవా అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. అనంతరం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సురేష్‌ను మాజీ సంఘం అధ్యక్షుడు గొర్రెపాటి వెంకట నరసింహారావు (చంటిబాబు), కాకుమాని రంగారావులు దుశ్శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. వేమూరి రమేష్ బాబు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ వేమూరి రత్నశేఖర్, యార్ల శ్రీకాంత్, నాని, పొట్లూరి యోహాను, వెంకటేశ్వరరావు, వడ్లమూడి ప్రసాద్, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.